క్లుప్తంగా

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జలజీవన్ మిషన్ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి ప్రతిఒక్కరికీ రక్షిత తాగునీరు అందిస్తామని చెప్పారు. పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రౌతులపూడి ఎస్సైగా అబ్దుల్ నబీ



రౌతులపూడి: గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌కు మొదటి ఎస్సైగా ఎండీ అబ్దుల్ నబీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన రిజిస్టర్‌లో సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. 26 పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రత్తిపాడులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి జరుగుతోందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలతో స్థానిక ఇందిరా కాలనీలో మాసా ఇమ్మాన్యుయేల్ ఇంటి వద్ద నుంచి మరియగిరి కొండ వరకూ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మితో కలిసి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ జి.జయశేఖర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు

ఏలేశ్వరం: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆజాద్ కీలకపాత్ర పోషించారన్నారు. ఆజాద్ హిందూపాజ్‌ను స్థాపించి అనేక పోరాటాలు చేశారన్నారు. అతి చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఆజాద్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ, వీహెచ్‌పీ నాయకులు కటకం కిరిటీ, ఏడీపీ ప్రసాద్, వుడతల రమణారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

గండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు గాను ఉపాధ్యాయులకు ఇస్తున్న లీడర్‌షిప్ ట్రెనింగ్ మొదటి దశ శిక్షణ ఆదివారంతో ముగిసింది. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18న ప్రధానోపాధ్యాయులకు మొదటి దశ రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ ట్రైనింగ్ ఇచ్చారు. ముగింపు సభలో విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటి బ్యాచ్ శిక్షణను దిగ్విజయంగా నిర్వహించడానికి సహకరించిన మాస్టర్ ట్రైనర్లను ఆమె అభినందించారు. ఈ శిక్షణను ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని, నాయకత్వ లక్షణాలను మెరుగుపర్చుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాసరావు సూచించారు. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర పర్యవేక్షకులుగా సీమాట్ లెక్చరర్స్ మహేశ్వరరెడ్డి, అపర్ణ హాజరయ్యారు. రెండో విడత రెసిడెన్షియల్ ట్రైనింగ్ సోమవారం నుంచి ఈ నెల 29 వరకు నిర్వహించనున్నట్టు ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ రామారెడ్డి తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లా ఏఎంవో గౌరీశంకర్, గండేపల్లి మండల ఎంఈవో కేబీహెచ్ నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు !

- ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లతో ప్రజలకు చేరువలో వైద్య సేవలు
- నెలలో రెండు సార్లు ఇంటి వద్దే వైద్య పరీక్షలు
- మెట్టలో 207 విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న దీర్ఘకాలిక రోగులు





టి.వెంకటాపురంలో విలేజ్ క్లినిక్ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా (ఫైల్)

తుని: గ్రామీణ ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఇంటింటికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా సచివాలయం పరిధిలోని ప్రజలకు నెలకు రెండు పర్యాయాలు వారి ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్యసేవలు విస్తృతమవ్వడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఎంతో మేలు జరుగుతోంది. అంతేకాకుండా ప్రతి గ్రామంలోనూ విలేజ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని ఇప్పటికే విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి రాగా పలు గ్రామాల్లో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయి.

నియోజకవర్గం	విలేజ్‌క్లినిక్‌లు	పూర్తి చేసినవి	నిర్మాణంలో ఉన్నవి
తుని	65	02	63
ప్రత్తిపాడు	69	04	65
జగ్గంపేట	73	30	43

మూడు నియోజకవర్గాల్లో ఇలా..

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో 207 విలేజ్ క్లినిక్‌లు మంజూరు చేశారు. ఇందులో 32 పూర్తి కాగా 175 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో విలేజ్ క్లినిక్ భవనాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఏ గ్రామంలో ఉన్న ప్రజలకు అక్కడే అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. జ్వరాల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు ఉచితంగా రక్త పరీక్షలతో పాటు మందులు అందుతాయి.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని రోగులకు ఇద్దరు వైద్యులు, ఏఎన్ఎం, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్త సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఓపీ సేవలు ఉంటాయి. అనంతరం సాయంత్రం 5 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాల వలన మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నారు. అంతేకాకుండా 14 రకాల పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణను చేస్తున్నారు. మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల ప్రజలకు సైతం ఇంటి వద్దకే వైద్య సేవలు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుని క్లస్టర్ పరిధిలో సేవల వివరాలు (నెలకు)

రక్త పరీక్షలు	25,000
షుగర్ పరీక్షలు	6500
హైపర్ టెన్షన్(బీపీ)	95,000
గర్భిణులకు వైద్య పరీక్షలు	1,25,000



కోటనందూరులో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని

వృద్ధులకు సకాలంలో వైద్యం



నా పేరు కామిరెడ్డి సత్యనారాయణ. వయస్సు 62 సంవత్సరాలు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న నేను వయస్సు మీద పడడంతో దూరంగా వెళ్లి ఆసుపత్రికి చూపించుకోవడం ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు వైద్య సిబ్బంది నేరుగా ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. పేదరికంలో కొట్టుమిట్టాడే మాలాంటి వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వం మేలు మరువలేము.

– కామిరెడ్డి సత్యనారాయణ, బిళ్లనందూరు, కోటనందూరు మండలం

మా వీధిలోనే వైద్య సేవలు



నేను కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. ఈ నొప్పులతో ఆసుపత్రికి వెళ్లాలంటే కిలోమీటర్ నడవలసి వచ్చేది. దీంతో ఎంతో ఇబ్బంది పడేదానిని. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో నెలలో రెండు సార్లు మా వీధి రామాలయంలోనే వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇస్తున్నారు. వైద్యులు స్వయంగా మా గ్రామానికి వచ్చి వైద్యం అందించడం చాలా ఆనందంగా ఉంది.

– కాళ్ల అప్పలరాజు, నర్సయ్యపేట, కిర్లంపూడి మండలం

ఆసుపత్రికి వెళ్లడం లేదు



ప్రభుత్వం ఇస్తున్న పింఛను తీసుకుని జీవితం గడుపుతున్నాను. ఒంట్లో ఆవేశం రావడంతో ఆసుపత్రికి వెళితే డబ్బులు తీసుకుని మందులు ఇచ్చారు. నెలకు రూ.500 వరకూ ఖర్చు అయ్యేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక సొంత ఊరిలోనే వైద్య సేవలు అందుతున్నాయి. డాక్టర్లు ఇంటికి వచ్చి పరీక్షించి ఉచితంగా మందులు ఇస్తున్నారు. దీంతో నేను ఆసుపత్రికి వెళ్లడం మానేశాను.

– పి.మరియా, గోపాలపట్నం, తొండంగి మండలం

అందుబాటులోకి వైద్య సేవలు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామీణులకు వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రత్తిపాడు, రాచపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామంలోని వైద్య సేవలు అందుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– ఊబా కృపావరం, ధర్మవరం, ప్రత్తిపాడు రూరల్

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు శర్మ

జగ్గంపేట: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు డాక్టర్ పిఎస్ శర్మ అన్నారు. జగ్గంపేట యూటీఎఫ్ భవనంలో ఆదివారం వాకర్స్ డిస్ట్రిక్ట్ 103వ గవర్నర్ మాచవరపు భాస్కరరావు అధ్యక్షతన వాకర్స్ క్లబ్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. నడు నడిపించు–ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రోజూ కొంతదూరం నడవడం వల్ల రుగ్మతులు దరిచేరవన్నారు. తొలుత వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జగ్గంపేట వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ, క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు కోడూరి రంగారావు, మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కచ్చా డ్రైను ఏర్పాటు



చినశంకర్లపూడిలో జేసీబీ సాయంతో కచ్చా డ్రైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ముంపు నుంచి విముక్తి కలిగించేందుకు కచ్చా డ్రైను ఏర్పాటు చేస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా గ్రామంలోని బీసీ కాలనీ కృష్ణుని ఆలయం నుంచి ఆర్ అండ్ బీ రోడ్డులోని దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహం వరకూ రహదారి ముంపునకు గురవుతోంది. సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు ఈ ప్రాంతంలో కచ్చా ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఏళ్ల తరబడి ఉన్న ముంపు సమస్యను కచ్చా డ్రైను ఏర్పాటుతో పరిష్కారం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- సోమవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం



సోమవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వం సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో ఆదివారం సర్పంచ్ జ్యోతుల రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అర్హులైన 520 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. ఒక్కో కుటుంబంలో నాలుగు నుంచి ఆరు పథకాలు పొందుతున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, అడబాల శ్రీను, తోట విష్ణు, జ్యోతుల పద్మనాభం, జ్యోతుల బాబ్జి, బొజ్జపు శ్రీను, జోకా శ్రీను, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు వందనం

ఇంటికే సంక్షేమ పథకాలు



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి. మా వలంటీర్ చింతల లక్ష్మి మాకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తోంది. అర్హత కలిగిన ప్రతి పథకాన్ని మాకు అందేలా కృషి చేస్తుంది. ఆమె కృషితో గత నాలుగేళ్లగా అమ్మ ఒడి, రైతు భరోసా వంటి పథకాలు మాకు అందుతున్నాయి. వలంటీర్ వ్యవస్థ ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం.

– మంతిన వీరమణి, ధర్మవరం, ప్రత్తిపాడు రూరల్

ఇంటి స్థలం వచ్చింది



"ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. ప్రతి పథకం నేరుగా వలంటీర్ ద్వారా మాకు అందుతున్నాయి. మా వలంటీర్ మాదెం రాజ్యలక్ష్మి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మాకు అవగాహన కల్పిస్తోంది. మా వలంటీర్ కృషితో మాకు జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం వచ్చింది. చేయూత పథకం ద్వారా రూ.10 వేలు, రైతు భరోసా ద్వారా రూ.13500 అందాయి. ఈ పథకాల కోసం ఏ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగలేదు."

– లోత రాజులమ్మ, కిత్తమూరిపేట, ప్రత్తిపాడు రూరల్

మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన



తునిలో ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రతినిధులు



అన్నవరంలో నిరసన తెలుపుతున్న దళితులు, ముస్లింలు, క్రైస్తవులు

తుని: మణిపూర్‌లో ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ డిమాండ్ చేశారు. స్థానిక వీరవరపుపేటలో ఆదివారం మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలన్నారు. దేశంలో ఇంత జరుగుతున్నా నోరు మెదపని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో ఆదివాసీలు, దళితులు, ముస్లింలు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అనూహ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లకు నిరసన

అన్నవరం: మణిపూర్‌లో గిరిజనులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా అన్నవరంలో దళిత, ముస్లిం, క్రైస్తవ నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, దళిత నాయకులు సరమర్ల మధుబాబు, రాజాల చిట్టిబాబు, రాయి శ్రీనివాస్, ఇండుగబిల్లి నూకరాజు, మల్లవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ ఆదివారం తెలిపారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో సారా బట్టీపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ కేసులో శెట్టి వీరబాబు, అబ్బిరెడ్డి చిన్నలను అరెస్టు చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో ఐదు లీటర్ల సారాతో గుత్తుల సత్తిబాబును అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ అశోక్ వివరించారు.

చురుగ్గా ఖరీఫ్ సాగు పనులు

గండేపల్లి: అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు పడడంతో మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. రైతులు వరి నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు మండల వ్యవసాయాధికారి పి.సద్గురు మూర్తి పలు సూచనలు చేశారు. వరి నారుమడిలో పసుపు పచ్చగా ఆకులు కనిపిస్తే జింకు లోపం ఉన్నట్టు గుర్తించి 12 శాతం చిలేటెడ్ జింకు కేజీ యూరియాతో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో వర్షాలు లేక వరినాట్లు ఆలస్యమయ్యాయని తెలిపారు.

మురుగు సమస్యకు మోక్షమెప్పుడో ?



తుని-నర్సీపట్నం రోడ్డుకు ఇరువైపులా ప్రవహిస్తున్న మురుగునీరు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పోలీసు స్టేషన్ వరకూ తుని–నర్సీపట్నం రోడ్డు మురికికూపంగా మారింది. ఈ రోడ్డుపై రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డుకు ఇరువైపులా ప్రవహిస్తున్న మురుగునీటితో వాహన, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న ఇళ్లలో వాడకం, మరుగదొడ్ల నీటిని రోడ్డుపై విడిచిపెడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డును ఆనుకొని ఉన్న రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వాళ్లు రాత్రివేళ కలుషినీటిని రోడ్డుపై వేస్తూ సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. సమస్యను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సేవలకు ప్రతిరూపం లయనిజం



ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న రమేష్ రాజు

ప్రత్తిపాడు: ఎల్లలు లేని సేవలకు ప్రతిరూపమే లయనిజమని లయన్స్ క్లబ్ ఇన్‌స్టలేషన్ అండ్ ఇండక్షన్ ఆఫీసర్ డీవీఎస్ రమేష్ రాజు అన్నారు. ప్రత్తిపాడులో ఆదివారం స్థానిక లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్‌రాజు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. సమాజ హితానికి లయన్స్ క్లబ్ అందించే సేవలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ కార్యదర్శి తాతా సాంబు, కోశాధికారి డి.ఫకీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షునిగా ఇంజినీర్ మోహన్

ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఇంజినీర్ బి.మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఏడిద రెడ్డినాయుడు, కోశాధికారిగా డి.ఫకీర్ రాజు, ఉపాధ్యక్షులుగా సూర్యప్రకాష్, డేవిడ్ రాజు, డైరెక్టర్లుగా డీవీఎస్ గోపీరాజు, పంతం కృష్ణ, కె. సంజీవరావు, మెంబర్ షిప్ చైర్మన్‌గా ఎంఎస్ కిరణ్‌లతో పాటు వివిధ పదవుల్లో అమరేంద్ర, పిల్లా పద్మరాజు, గుడాల వెంకటరత్నం, నాగేశ్వరరావు, సాకేత్‌వర్మ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఇన్‌స్టలేషన్ అండ్ ఇండక్షన్ ఆఫీసర్ డీవీఎస్ రమేష్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజన్న సహకారంతోనే మెట్ట సస్యశ్యామలం

- మాజీ మంత్రి తోట నరసింహం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితోనే మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గం ప్రస్తుతం గోదావరి జలాలతో సస్యశ్యామలం అవుతోందని మాజీ మంత్రి తోట నరసింహ అన్నారు. జగ్గంపేట మండలం కాండ్రేగులలో ఆదివారం వరపుల సుబ్బారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి బాటలోనే రాష్ట్రాభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజా సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో అప్పట్లో పుష్కర ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయడం వల్లే ప్రస్తుతం మెట్ట ప్రాంతానికి మూడు లిఫ్టుల ద్వారా గోదావరి జలాలు పుష్కలంగా అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, తులా రాముడు, గఫూర్, తోట రాంజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డీఐజీ తనిఖీలు

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏలూరు రేంజ్ డీఐజీ జీవీఎస్ అశోక్‌కుమార్ ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని రిజిస్టర్లు, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. క్రైం రేట్ తగ్గించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ పి. శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సీఐ కె.కిషోర్‌కుమార్, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.